## జీఎస్టీ వసూళ్లు
# ఆల్‌టైమ్ హై

ఏప్రిల్‌లో **రూ.2.37** లక్షల కోట్లు




న్యూఢిల్లీ, మే 1: జీఎస్టీ వసూళ్లు రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నెల ఏప్రిల్‌లో రూ.2.37 లక్షల కోట్ల మేర జీఎస్టీ వసూలైనట్టు కేంద్ర ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. క్రితం ఏడాది ఇదే నెలలో వసూలైన రూ.2.10 లక్షల కోట్లతో పోలిస్తే 12.6 శాతం అధికమని పేర్కొంది. జీఎస్టీ అమలులోకి వచ్చిన జూలై 1, 2017 తర్వాత ఇదే అత్యధిక వసూళ్లు కావడం విశేషం. ఈ ఏడాది మార్చి నెలలో రూ.1.96 లక్షల కోట్లు వసూలయ్యాయి. గడిచిన నెలలో వసూలైనదాంట్లో దేశీయంగా రూ.1.96 లక్షల కోట్లు వసూళ్లు జరిగాయి. గతేడాదితో పోలిస్తే 10.7 శాతం మేర పెరిగాయి. వీటిలో సెంట్రల్ జీఎస్టీ కింద రూ.48,634 కోట్లు వసూలవగా, స్టేట్ జీఎస్టీ కింద రూ.59,372 కోట్లు, ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ కింద రూ.69,504 కోట్లు, సెస్ రూపంలో రూ.12,293 కోట్లు వసూలయ్యాయి. దేశ ఆర్థిక రంగం బలంగా ఉందన్నడానికి ఈ జీఎస్టీ వసూళ్లే నిదర్శనమని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నెలలోనే పన్ను వసూళ్లు రూ.2 లక్షల కోట్ల మైలురాయి దాటిందని డెలాయిట్ ఇండియా పార్ట్‌నర్ ఎంఎస్ మణి తెలిపారు. అత్యధిక ఉత్పత్తి, వినిమయ రాష్ర్టాల్లో జీఎస్టీ వసూళ్లలో వృద్ధి 11 శాతం నుంచి 16 శాతం మధ్యలో నమోదవడం వల్లనే రికార్డు స్థాయికి చేరుకున్నాయన్నారు.

**ఇప్పటి వరకు రికార్డు స్థాయిలో జీఎస్టీ వసూళ్లు**

| | |
|---|---|
| ఏప్రిల్ 2025 | రూ.2.37 లక్షల కోట్లు |
| ఏప్రిల్ 2024 | రూ.2.10 లక్షల కోట్లు |
| మార్చి 2025 | రూ.1.96 లక్షల కోట్లు |

# వాహన విక్రయాలు అంతంతే

న్యూఢిల్లీ, మే 1: మార్కెట్ పరిస్థితులు నిరుత్సాహకరంగా ఉన్నప్పటికీ గడిచిన నెలలో వాహన విక్రయాలు ఆశించిన స్థాయిలో నమోదయ్యాయి. కార్ల తయారీలో అగ్రగామి సంస్థలు మారుతి సుజుకీ, మహీంద్రా అండ్ మహీంద్రా విక్రయాలు పెరగగా..టాటా మోటర్స్, హ్యుందాయ్ సేల్స్ తగ్గుముఖం పట్టాయి. అయినప్పటికీ మహీంద్రా రెండో స్థానానికి, టాటా మోటర్స్ మూడో స్థానానికి ఎగబాకింది. కానీ, రెండో స్థానంలో కొనసాగిన హ్యుందాయ్ ఈసారి నాలుగో స్థానంతో సరిపెట్టుకున్నది. మారుతి అమ్మకాలు ఏడు శాతం అధికమయ్యాయి.

**ఏప్రిల్ నెలలో వాహన అమ్మకాలు**

| సంస్థ | 2025 | 2024 | వృద్ధి(శాతంలో) |
|---|---|---|---|
| మారుతి | 1,79,791 | 1,68,089 | 7 |
| మహీంద్రా | 84,170 | ==== | 19 |
| టాటా మోటర్స్ | 72,753 | 77,521 | -6.1 |
| హ్యుందాయ్ | 60,774 | 63,701 | -5 |
| టయోటా కిర్లోస్కర్ | 27,324 | 20,494 | 33 |
| ఎంజీ మోటర్స్ | 5,829 | 4,725 | 23 |
| కియా ఇండియా | 23,623 | 19,968 | 18 |
| హోండా కార్స్ | 3,360 | 4,351 | -23 |
| ద్విచక్ర వాహనాలు | | | |
| టీవీఎస్ మోటర్ | 4,43,896 | 3,83,615 | 16 |
| సుజుకీ మోటర్‌సైకిల్ | 1,12,948 | 99,377 | 14 |
| రాయల్ ఎన్‌ఫీల్డ్ | 86,559 | 82,043 | 6 |


# హైదరాబాద్ ఆఫీస్ ఖాళీ

## వృథాగా 284 లక్షల చదరపు అడుగుల్లో కార్యాలయ స్థలాలు
### దేశంలోనే అత్యధికం.. ఆ తర్వాత ఢిల్లీ-ఎన్‌సీఆర్
### అద్దెకు పెద్దగా ఆసక్తి చూపని కార్పొరేట్లు: వెస్టియన్

*ఈ నగరానికి ఏమైంది. అవును.. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌ను చూస్తే ఇలాంటి ప్రశ్నలే తలెత్తుతున్నాయిప్పుడు.*

*ఒకప్పుడు హాట్‌కేకుల్లా అమ్ముడుపోయిన ఆఫీస్ స్పేస్.. ఇప్పుడు ఆదరణ లేక కళావిహీనంగా కనిపిస్తున్నది. అద్దెకు తీసుకునేవారే కరువైపోయారు మరి.*

*గతంలో ఇక్కడ కార్యాలయాలను ఏర్పాటు చేసుకొనేందుకు క్యూ కట్టిన కార్పొరేట్లు.. ప్రస్తుతం ముఖం చాటేస్తున్నారు. దీంతో లక్షల చదరపు అడుగుల్లో కార్యాలయ స్థలాలు ఖాళీగా ఉన్నాయంటూ రియల్ ఎస్టేట్ రిపోర్టులు వస్తున్నాయి.*



న్యూఢిల్లీ, మే 1: హైదరాబాద్‌లో కార్యాలయ స్థలాలకు పెద్దగా ఆదరణే లేకుండాపోయింది. ఒకప్పుడు దేశంలోని ప్రధాన నగరాలను వెనక్కినెడుతూ ఆఫీస్ స్పేస్ మార్కెట్‌లో దూసుకుపోయిన రాష్ట్ర రాజధాని నగరానికి ఇప్పుడు డిమాండ్ కనిపించడం లేదు. ఏడాదిన్నర క్రితం వరకు హైదరాబాద్‌లో ఆఫీస్‌ను ఏర్పాటు చేసేందుకు ఉత్సాహం చూపిన కార్పొరేట్లు.. ప్రస్తుతం ఆసక్తి చూపించడం లేదు. ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ వెస్టియన్ విడుదల చేసిన తాజా గణాంకాలే ఇందుకు నిదర్శనం.

**284 లక్షల చదరపు అడుగుల్లో..**

దేశంలోని 7 ప్రధాన నగరాల ఆఫీస్ స్పేస్ మార్కెట్‌పై వెస్టియన్ సర్వే చేసింది. దీని వివరాల ప్రకారం హైదరాబాద్‌లోనే గరిష్ఠంగా కార్యాలయ స్థలాలు వృథాగా పడిపోయి ఉన్నట్టు తేలింది. ఏకంగా 284 లక్షల చదరపు అడుగుల్లో ఆఫీస్ స్పేస్ ఖాళీగా ఉన్నదని వెస్టియన్ ఈ సందర్భంగా వెల్లడించింది. ఈ ఏడాది మార్చి నాటికి హైదరాబాద్‌లో మొత్తం అందుబాటులో ఉన్న ఆఫీస్ స్పేస్ 1,620 లక్షల చదరపు అడుగులు. ఇందులో 284 లక్షల చదరపు అడుగులు ఖాళీగానే ఉన్నది. ఇది మొత్తం స్టాక్‌లో 17.5 శాతానికి సమానం. కార్పొరేట్ కంపెనీలు అద్దెకు తీసుకొనేందుకు పెద్దగా ఆసక్తి చూపట్లేదని వెస్టియన్ పేర్కొన్నది. కాగా, గతంలోనూ ఆయా నగరాల్లో ఆఫీస్ స్పేస్ ఖాళీలుండేవి. అయితే హైదరాబాద్‌లో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి కనిపించేది. దాంతో ఆఫీస్ స్పేస్ గిరాకీలో నగరం ఎప్పుడూ టాప్‌లో ఉండేది. మిగతా నగరాలతో పోల్చితే లీజింగ్ పెద్ద ఎత్తున జరిగేది మరి. కానీ మారిన పరిస్థితులతో ఇప్పుడు ఖాళీల్లో టాప్‌లో ఉంటున్నది.

**బీఆర్ఎస్ హయాంలోనే బాగుబాగు**

ఉమ్మడి రాష్ట్రంలో నత్తనడకన సాగిన అభివృద్ధి.. విభజన అనంతరం తెలంగాణలో పరుగులు పెట్టింది. రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయాలు అన్ని రంగాలను బలపర్చాయి. ఐటీ, ఫార్మా, ఆటో, ఏవియేషన్, డిఫెన్స్ ఇలా కీలక రంగాలు వృద్ధిపథంలో పయనించాయి. ఇది ఇక్కడి నిర్మాణ రంగానికి ఊహించని స్థాయిలో డిమాండ్‌ను తెచ్చిపెట్టింది. ముఖ్యంగా ఆఫీస్ స్పేస్‌కు గిరాకీని అమాంతం పెంచేసింది. దేశ, విదేశీ సంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యాలయాలను ఏర్పాటు చేసేందుకు భారీగా ముందుకొచ్చాయి. భారత్‌లోకి రావాలంటే హైదరాబాద్‌నే ప్రధాన కేంద్రంగా చేసుకోవాలన్నంతగా డిమాండ్ నెలకొన్నదంటే ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. ఈ క్రమంలోనే మైక్రోసాఫ్ట్, గూగుల్, అమెజాన్ వంటి అనేక సంస్థలు హైదరాబాద్‌లో బడాబడా ఆఫీసులను తీసుకొచ్చాయి. మరెన్నో స్టార్టప్‌లూ కొలువుదీరాయి. ఫలితంగా ఆఫీస్ మార్కెట్ వేగంగా విస్తరించింది. దాదాపు పదేండ్ల టీఆర్ఎస్, బీఆర్ఎస్ పాలనలో ఇలాగే సాగిందంతా. కానీ రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో అంతా తలకిందులైంది. ఏడాదిన్నరగా పెట్టుబడులు రాక మార్కెట్‌లో స్తబ్ధత నెలకొన్నది. అందుకు ఆఫీస్ స్పేస్ మార్కెట్ అద్దం పడుతున్నది.

- దేశంలోని ప్రధాన నగరాల్లో హైదరాబాద్‌లోనే అత్యధికంగా ఆఫీస్ స్పేస్ ఖాళీలు. ఆ తర్వాత ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో ఉన్నాయి.
- బెంగళూరు (2,805 లక్షల చదరపు అడుగులు) తర్వాత ఎక్కువగా ఆఫీస్ స్పేస్ అందుబాటులో ఉన్నది హైదరాబాద్ (1,620 లక్షల చదరపు అడుగులు)లోనే.
- బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్ ఆఫీస్ స్పేస్ మార్కెట్‌లో జోరుగా డిమాండ్-సప్లై. ఇప్పుడు డిమాండ్ లేకపోవడంతో సప్లై కూడా ఆగిపోయింది.
- ఈ ఏడాది జనవరి-మార్చిలో దేశీయంగా ఆఫీస్ స్పేస్ లీజింగ్ 34 శాతం పెరిగి 179.6 లక్షల చదరపు అడుగులకు చేరిక.
- జీసీసీలు, ఐటీ, ఐటీ అనుబంధ రంగాలు, బ్యాంకింగ్, ఆర్థిక, బీమా రంగాల నుంచి కనిపించిన డిమాండ్.

**దేశంలోని 7 ప్రధాన నగరాల్లో ఖాళీ ఆఫీస్ స్పేస్ నిల్వలు**

| నగరం | లక్షల చ.అడుగుల్లో |
|---|---|
| హైదరాబాద్ | 284 |
| ఢిల్లీ-ఎన్‌సీఆర్ | 232 |
| బెంగళూరు | 210 |
| ముంబై | 125 |
| కోల్‌కతా | 79 |
| చెన్నై | 60 |
| పుణె | 56 |

**ఆగిన కొత్త నిర్మాణాలు**

ఇప్పటికే నిర్మాణం పూర్తయ్యి అందుబాటులో ఉన్న ఆఫీస్ స్పేస్‌కు గిరాకీ అంతంత మాత్రంగానే ఉండటంతో కొత్త నిర్మాణాలు దాదాపుగా ఆగిపోయాయి. రియల్టర్లు, ఆఫీస్ స్పేస్ నిర్మాణ కంపెనీలు నూతన ప్రాజెక్టులకు దూరంగా ఉంటున్నాయి. ఫలితంగా సిమెంట్, ఉక్కు, ఇతర నిర్మాణ అనుబంధ రంగాలు కుదేలయ్యాయి. వాటిమీద ఆధారపడుతున్న పరిశ్రమలు, వ్యాపారులు, ఉద్యోగులు, కూలీల భవిష్యత్తు ఆందోళనలో పడింది. నిజానికి హైదరాబాద్‌లో ఖాళీగా ఉన్న కార్యాలయ స్థలాలు మునుపు ఇంకా ఎక్కువ (19 శాతం)గానే ఉండేవి. కానీ కొత్త ప్రాజెక్టులు రాకపోవడంతో ఇవి కాస్త తగ్గాయి. కాగా, హైదరాబాద్, ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరు, ముంబై, చెన్నై, కోల్‌కతా, పుణె నగరాలపై వెస్టియన్ సర్వే చేసింది.

## కాగ్నిజెంట్‌లో 20 వేల ఉద్యోగాలు

న్యూఢిల్లీ, మే 1: అమెరికాకు చెందిన ఐటీ సేవల సంస్థ కాగ్నిజెంట్..ప్రస్తుతేడాది 20 వేల మంది ఫ్రెషర్లను నియమించుకోనున్నట్టు ప్రకటించింది. కృత్రిమ మేధస్సుతో సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్‌పై మంచి పట్టున్న ఉద్యోగులను రిక్రూట్ చేసుకోనున్నది. నూతన టెక్నాలజీ సేవలకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నట్టు, గతేడాది రిక్రూట్ చేసుకున్నవారి కంటే రెండింతలు అధికంగా ఈసారి నియమించుకోనున్నట్టు కాగ్నిజెంట్ సీఈవో రవి కుమార్ ఎస్ తెలిపారు. ప్రస్తుతం సంస్థలో 3,36,300 మంది ఉద్యోగులు ఉన్నారు.

# దిగొస్తున్న బంగారం ధర

**హైదరాబాద్‌లో తులం రూ.2,180 డౌన్ • 24 క్యారెట్ రూ.95,730**

హైదరాబాద్, మే 1: నిన్నమొన్నటిదాకా ఆకాశమే హద్దుగా పరుగులు పెట్టిన బంగారం ధరలు.. ఇప్పుడు అంతే వేగంగా దిగొస్తున్నాయి. గురువారం ఒక్కరోజే హైదరాబాద్‌లో 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత) 10 గ్రాముల రేటు రూ.2,180 తగ్గి రూ.95,730 వద్ద స్థిరపడింది. 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత) తులం విలువ కూడా రూ.2,000 పడిపోయి రూ.87,750 వద్ద నిలిచింది. నిజానికి గత వారం రోజులుగా గోల్డ్ రేట్లు క్రమంగా తగ్గుముఖం పడుతున్నాయి. అంతకుముందు తులం రేటు తొలిసారి లక్ష రూపాయల మార్కును దాటిపోయిన విషయం తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రతీకార సుంకాలు, వివిధ కారణాలతో పతనమైన స్టాక్ మార్కెట్ల వల్ల దేశీయ మార్కెట్‌లో పుత్తడి ధరలు వరుసగా పెరుగుతూపోయాయి. అయితే అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వస్తున్న బలహీన సంకేతాల నడుమ ధరలు దిగువముఖం పడుతున్నాయి.







## లోహియా బిస్కెట్ ప్లాంట్

హైదరాబాద్, మే 1: హైదరాబాద్‌కు సమీపంలో మేడ్చల్ వద్ద వరల్డ్ క్లాస్ బిస్కెట్ తయారీ యూనిట్‌ను ప్రారంభించింది లోహియా గ్రూపు. ఏడు ఎకరాల స్థలంలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్‌లో ప్రస్తుతం నెలకు 1000 టన్నుల బిస్కెట్లు తయారుకానుండగా, వచ్చే నాలుగేండ్లలో ఈ సామర్థ్యాన్ని 5 వేల టన్నులకు పెంచుకోనున్నట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. వచ్చే నాలుగేండ్లలో రూ.300 కోట్ల పెట్టుబడి పెట్టనున్నట్టు ప్రకటించింది.

## హైదరాబాద్‌లో ఆల్ట్.ఎఫ్ కో-వర్కింగ్ ఆఫీస్

హైదరాబాద్, మే 1: కో-వర్కింగ్ నిర్వహణ సంస్థ ఆల్ట్.ఎఫ్..హైదరాబాద్‌లో నూతన కార్యాలయాన్ని తెరిచింది. 56 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌లో 1,200 మందికి పైగా కూర్చోవడానికి వీలుంటుందని పేర్కొంది. సౌకర్యవంతమైన కార్యాలయాల మార్కెట్ భారీ వృద్ధిని నమోదు చేసుకుంటున్న హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన తొలి సెంటర్ ఇదేనని కంపెనీ కో-ఫౌండర్ యోగేశ్ అరోరా తెలిపారు. ఒక్కో డెస్క్ నెలకు రూ.8 వేల చొప్పున చార్జీ వసూలు చేస్తున్నట్టు చెప్పారు. ప్రస్తుతం సంస్థ..ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్‌లలో కో-వర్కింగ్ కార్యాలయాలను నిర్వహిస్తున్నది.

### కార్మికులకు చేసిన సన్మానం
## ఎప్పటికీ గుర్తుంటుంది
### అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా



ఖలీల్‌వాడి, మే 1: మేడే సందర్భంగా తాను కార్మికులను సన్మానించిన కార్యక్రమాలు ఎప్పటికీ గుర్తుంటాయని నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా గుర్తు చేసుకున్నారు. మేడే సందర్భంగా ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు కార్మికులను సన్మానించి, వారితో కలిసి భోజనం చేసే వాడినని తెలిపారు. ఆ సమయంలో కార్మికులు ఎంతో సంతోషం వ్యక్తం చేసే వారని పేర్కొన్నారు. నగరవాసుల ఆరోగ్యం కోసం వారు ఎంతో శ్రమించే వారని, మేడే సందర్భంగా వారితో సహపంక్తి భోజనం చేయడం సంతోషాన్ని ఇచ్చేదని తెలిపారు. అందరూ తమను దూరంగా పెడుతారని, మీరు మాత్రం మాతో కలిసి భోజనం చేస్తున్నారని, ఇలాంటి గౌరవం తమకు లభిస్తుందని అనుకోలేదని కార్మికులు తెలిపే వారని పేర్కొన్నారు.

### బీసీ సంక్షేమ సంఘం
## రూరల్ అధ్యక్షుడిగా బండారి నరేశ్


నియామక పత్రం అందుకుంటున్న నరేశ్

సిరికొండ, మే 1: బీసీ సంక్షేమ సంఘం రూరల్ అధ్యక్షుడిగా మండలంలోని తాళ్లరామడుగు గ్రామానికి చెందిన బండారి నరేశ్ ఎన్నికయ్యాడు. నిజామాబాద్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలో జిల్లా బాధ్యులు ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ.. బీసీ సంక్షేమానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందజేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన బీసీ సంక్షేమ సంఘం సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

### అంధకారంలో అంతర్రాష్ట్ర చెక్ పోస్టు

రెంజల్, మే1 : మండలంలోని కందకుర్తి గ్రామ సరిహద్దులో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్ పోస్టు అంధకారంలో కొనసాగుతున్నది. గతనెల 15న కందకుర్తి సమీపంలో అంతర్రాష్ట్ర సరిహద్దులో రెవెన్యూ, పోలీస్, వ్యవసాయ శాఖల సమన్వయంతో చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. మహారాష్ట్రలో పండించిన ధాన్యాన్ని తెలంగాణలో విక్రయించి మద్దతు ధర పొందకుండా నిరంతరం తనిఖీలు చేపట్టేందుకు ఉన్నతాధికారులు కందకుర్తి వద్ద చెక్ పోస్టును ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో విధులు నిర్వహించే వివిధ శాఖల అధికారులు చెక్ పోస్టు వద్ద విద్యుత్ సరఫరా లేక నానా కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఒక పక్క దోమలు, మరోపక్క ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ లేక పోవడంతో టార్చ్ లైట్ల సాయంతో రాత్రంతా జాగరణ చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందని వారు వాపోతున్నారు. ఈవిషయమై తహసీల్దార్ శ్రావణ్‌కుమార్‌ను వివరణ కోరగా చెక్‌పోస్టుకు విద్యుత్ సరఫరా లేదని, తాత్కాలికంగా విద్యుత్ సౌకర్యం ఏర్పాటు కోసం సంబంధిత శాఖను కోరినట్లు తెలిపారు.

## చురుకుగా రోడ్డు విస్తరణ పనులు

- బీఆర్ఎస్ హయాంలో నిధులు మంజూరు


పూర్తి అయిన కంకర లేయర్ పనులు

నవీపేట, మే 1: మండలంలోని రాంపూర్ రోడ్డు విస్తరణ పనులు చురుకుగా సాగుతున్నాయి. గతంలో ఈ రోడ్డు ఇరుకుగా ఉండడంతో వాహనదారులు ఇబ్బందులు పడేవారు. ఎదురెదురుగా వాహనాలు వస్తే కష్టాలు తప్పేవి కావు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో బోధన్ ఎమ్మెల్యే మహ్మద్ షకీల్ ఆమేర్ ప్రత్యేక శ్రద్ధ వహించి డబుల్ రోడ్డు మంజూరు చేయించారు. ధర్యాపూర్ రైల్వే గేటు నుంచి భరత్‌నగర్ తండా ప్రధాన రహదారిని కలుపుతూ 6.6 కిలోమీటర్ల దూరం వరకు పనులు శరవేగంగా సాగుతున్నాయి. రోడ్డు మార్గంలో 16 కల్వర్టులు నిర్మిస్తున్నారు. వాటి పనులు తుది దశకు చేరుకున్నాయి. రాంపూర్ డబుల్ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయితే ఫత్తేనగర్, ఎల్‌కే ఫారం, భరత్‌నగర్ తండా, మౌలాలి తండా ప్రజలకు రావాణా సౌకర్యం మెరుగు పడనున్నది.

**పనులు త్వరగా పూర్తి చేస్తాం**

రాంపూర్ బీటీ రోడ్డు పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకుంటున్నాం. ఈ రోడ్డుకు 2023లో రూ.8.80 కోట్లు మంజూరయ్యాయి. ఈ రోడ్డును 6.6 కిలోమీటర్ల మేర పనులు చేపడుతున్నాం. సంబంధిత కాంట్రాక్టర్ పనులను నాణ్యతగా చేపట్టే విధంగా చర్యలు తీసుకుంటున్నాం.

– రామ్మోహన్, ఆర్అండ్‌బీ డిప్యూటీ ఈఈ, బోధన్

## అపూర్వ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న 1999–2000 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు

ఖలీల్‌వాడి, మే 1: మోపాల్ మండలంలోని ముదక్‌పల్లి పాఠశాల లో 1999–2000 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థుల సమ్మేళనాన్ని గురువారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నప్పటి విషయాలను నెమరు వేసుకున్నారు. ఒకరినొకరు పలుకరించుకుంటూ, వారు చేసే ఉద్యోగాలు, ఇతర వ్యాపకాలను అడిగి తెలుసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సరదాగా గడిపారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

### విద్యుత్ భద్రత వారోత్సవాలు ప్రారంభం

కంఠేశ్వర్, మే 1: విద్యుత్ భద్రత వారోత్సవాలు ఈనెల 7 వరకు నిర్వహించనున్నారు. మొదటి రోజు గురువారం నిజామాబాద్‌లోని పవర్ హౌస్‌లో డివిజనల్ ఇంజినీర్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సిబ్బంది భద్రతా వస్తువులను తప్పకుండా వాడుతూ పనిచేయాలని సూచించారు. విద్యుత్ వారోత్సవాల గోడ ప్రతులను ఆవిష్కరించారు. సమావేశంలో విద్యుత్ అధికారులు చంద్రశేఖర్, రాజేందర్‌రెడ్డి, నగేశ్, రవూఫ్ తదితరులు పాల్గొన్నారు.

### అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

కామారెడ్డి రూరల్, మే1: దేవునిపల్లి పీఎస్ పరిధిలో అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి చెందింది. దేవునిపల్లి ఎస్సై రాజు కథనం ప్రకారం.. నర్సన్నపల్లి గ్రామానికి చెందిన చిదుర గంగారెడ్డి తన భార్య కవిత బుధవారం ఇంటి నుంచి వెళ్లి తిగిరి రాలేదు. గంగారెడ్డి తన వ్యవసాయ బావి వద్దకు వెళ్లి చూడగా బావిలో కవిత మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా వారు వెళ్లి పరిశీలించారు. గుర్తుతెలియని వ్యక్తులు తన భార్యను చీర గొంగుతో మెడకు చుట్టి ఉరేసి ఆమెపై ఉన్న బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారని మృతురాలి భర్త పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

## పహల్గాం అమరులకు నివాళి


కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న 17వ డివిజన్‌వాసులు

కంఠేశ్వర్, మే 1: పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన దాడిలో మరణించిన పర్యాటకులకు నగరంలోని 17వ డివిజన్‌వాసులు గురువారం నివాళి అర్పించారు. గౌతంనగర్, రాజీవ్‌నగర్‌కు చెందిన పలువురు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. గౌతంనగర్ చౌరస్తా నుంచి రాజీవ్‌నగర్ చౌరస్తా వరకు ర్యాలీ తీసి, నివాళులర్పించారు. వారి ఆత్మకు శాంతి చేకూరాలని మౌనం పాటించారు. నాయకులు సాయిరాం, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

# వేర్వేరు కారణాలతో నలుగురి ఆత్మహత్య

ఆర్మూర్‌టౌన్, మే1: జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో వేర్వేరుగా ఐదుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌కు చెందిన సయ్యద్ జాఫర్(42) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ గురువారం తెలిపారు. కొన్ని రోజులుగా మద్యానికి బానిసై జీవితంపై విరక్తి చెంది సయ్యద్ జాఫర్ బుధవారం పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

**వరదకాలువలో దూకి వ్యక్తి..**


గోపినాథ్(ఫైల్)

మోర్తాడ్, మే1: మోర్తాడ్ గ్రామానికి చెందిన కట్టెకొల్ల గోపినాథ్(51) బుధవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లి వరద కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. మృతదేహాన్ని వరదకాలువలో నుంచి బయటికి తీయించి పోస్టుమార్టానికి తరలించారు. మృతుడి భార్య మానస ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. గోపినాథ్ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడని, దానికి తోడు కూతురు ఇంటిపై ఉండడంతో మానసికంగా కృంగిపోయి ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిసింది.

**పురుగుల మందు తాగి మహిళ..**

ఆర్మూర్‌టౌన్, మే1: మండలంలోని చేపూర్ గ్రామానికి చెందిన ముత్యాల సుష్మ(47) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ గౌడ్ గురువారం తెలిపారు. ఎస్‌హెచ్‌వో కథనం మేరకు.. సుష్మ మానసిక ఆరోగ్య పరిస్థితి బాగాలేకపోవడంతో ఇటీవల దవాఖానలో చికిత్స తీసుకుంది. అయినా ఆరోగ్య పరిస్థితి బాగుపడకపోవడంతో మనస్థాపానికి గురై ఇంట్లో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఆమెను హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో తెలిపారు.

**మద్యానికి బానిసై ఒకరు..**

పాతంగల్, మే 1: మద్యానికి బానిసైన వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని సోంపూర్ గ్రామంలో గురువారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సోంపూర్‌కు చెందిన సంజీవ్(42) మద్యానికి బానిసయ్యాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సునీల్ తెలిపారు.

**గుర్తు తెలియని వాహనం ఢీ..**
**మహిళ మృతి**

మాక్లూర్, మే 1: మండలంలోని ఢీకంపల్లి గ్రామానికి చెందిన సాయినాథ్, అతని భార్య గౌరీ (39) బైక్‌పై బోధన్‌కు గురువారం బంధువుల అంత్యక్రియలకు వెళ్లారు. తిరిగి స్వ గ్రామానికి వెళ్తుండగా మార్గమధ్యంలో గొట్టుముక్కుల గ్రామం సమీపంలో బీటీ రోడ్డు మూలమలుపు వద్ద ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. సాయినాథ్ భార్య గౌరీ బైక్‌పై నుంచి కింద పడగా ఆమె తలకు తీవ్ర గాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పేర్కొన్నారు.


చిక్కడ్‌పల్లి శివారులో ప్రమాదకరంగా వంగి ఉన్న విద్యుత్ స్తంభం

## విద్యుత్ స్తంభం సరిచేయండి..!

రుద్రూర్, మే 1: మండలంలోని చిక్కడ్‌పల్లి గ్రామ శివారులో ఓ విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. పొలాల్లో స్తంభం పూర్తిగా వంగి, నేలకొరిగే స్థితికి చేరుకున్నది. దీంతో రైతులు భయభ్రాంతులకు గురవుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి, ప్రమాదం జరగకముందే స్తంభాన్ని సరిచేయాలని రైతేలు కోరుతున్నారు.

## నల్లమట్టికి భలే డిమాండ్

మోర్తాడ్, మే 1: వ్యవసాయ భూములను సారవంతం చేసుకోవడానికి నల్లమట్టి ఎంతగానో ఉపయోగపడుతున్నది. దీంతో అన్ని గ్రామాల్లో దీనికి డిమాండ్ ఏర్పడింది. వేసవిలో వ్యవసాయ భూముల్లో నల్లమట్టిని వేయించి వర్షాలు కురిసే సమయంలో దుక్కిదున్నుతారు. నల్లమట్టిలో ఉన్న పోషకాలు భూమికి అంది భూమి సారవంతమై పంటల దిగుబడి పెరిగే అవకాశం ఉంది. ఇదే అదునుగా నల్లమట్టి దందా బాల్కొండ నియోజకవర్గంలో జోరుగా కొనసాగుతున్నది. ఒక డంపర్ (పెద్ద టిప్పర్) నల్లమట్టిని రూ.12వేలకు విక్రయిస్తున్నారు. సేంద్రియ ఎరువుల ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో రైతులు నల్లమట్టి వైపు మొగ్గుచూపుతున్నారు. దీంతో దీనికి డిమాండ్ పెరిగింది. వ్యాపారులు గ్రామ అభివృద్ధి కమిటీకి డబ్బులు చెల్లించి దందాను కొనసాగిస్తున్నారు. రైతులకు తక్కువ ధరకు నల్లమట్టి వచ్చేలా అధికారులు చూడాలని రైతులు కోరుతున్నారు.


టిప్పర్‌లో తరలిస్తున్న నల్లమట్టి